క్లుప్తంగా

అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలి



చెల్లూరు పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీవైఈవో ఫణి

రాయవరం: ప్రతి విద్యార్థి తరగతి పూర్తి చేసే సమయానికి ఆ తరగతిలో సాధించాల్సిన అభ్యసనా సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహ ఫణి సూచించారు. మండలంలోని చెల్లూరు ఎస్ఎస్ఎస్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 4, 5 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయా తరగతుల్లో విద్యార్థుల నోట్సులు, వర్క్ బుక్‌లను పరిశీలించారు. సిలబస్‌ను పూర్తి చేశారా? లేదా? ఉపాధ్యాయులు డైరీ, లెసన్ ప్లాన్స్ రాస్తున్నారా? లేదా? తదితర విషయాలను పరిశీలించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వల్లూరు జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు



వల్లూరు జగనన్న కాలనీలో జరుగుతున్న పనులు

కపిలేశ్వరపురం: వల్లూరు జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. కాలనీవాసుల సౌకర్యం కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సాగుతున్న పనులను సచివాలయ ఇంజినీరింగ్ అధికారి కల్యాణి పర్యవేక్షిస్తున్నారు.

బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మండపేట: పట్టణ పరిధి ఏడిద రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు సుమారు 35–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటాడని, అతనికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలియదని పట్టణ ఎస్సై నాంచారయ్య తెలిపారు. వీఆర్వో నాగూర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివారికి మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యులు ఆధ్వర్యంలో తిరుమల యాత్రకు అవకాశం లేని భక్తులకు దీక్షా విరమణ చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ పడాల పెదవేంకటరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండరామాలయ వార్షికోత్సవం

అంబాజీపేట: మాచవరం శివారు చప్పిడివారి పాలెంలో ఉన్న కోదండరామ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి కలశారాధన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

రూ.13.68 లక్షలకు రేవు వేలం పాట ఖరారు

మామిడికుదురు: కరవాక–ఓడలరేవు వేలం పాట రూ.13.68 లక్షలకు ఖరారైంది. కరవాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం రేవు వేలం పాట నిర్వహించారు. జాయింట్ కమిటీ చైర్మన్ రేకాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకూ రేవు నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో హెచ్చు ధరకు రేకాడి నాగరాజు దక్కించుకున్నారు. వేలం పాటలో కరవాక ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు, ఓడలరేవు సర్పంచ్ మల్లాడి మంగతాయారు, ఎంపీపీ పాలా శ్రీలక్ష్మి, ఈఓ పీఆర్డీలు ఎంపీవీ సత్యనారాయణమూర్తి, అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరావు, రామచంద్రమూర్తి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వేసవి విడిదిగా గ్రంథాలయాలు

- పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులకు అనుకూలం
- పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రయోజనం
- గ్రంథాలయాల్లో సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న పాఠకులు

కపిలేశ్వరపురం: గ్రంథాలయాలు విద్యార్థులకు వేసవి విడిదిగా ఉంటున్నాయి. సెలవుల్లో విజ్ఞాన సంపాదనకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులు విద్యాలయాలకు వెళ్లేందుకు సుమారు రెండు నుంచి మూడు నెలలు పడుతుంది. ఈ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గ్రంథాలయం ఎంతో మేలు చేస్తాయి. ప్రభుత్వం పోటీ పరీక్షలతోపాటు ఇతర విజ్ఞానదాయకమైన పుస్తకాలను సమకూర్చింది. విద్యాసంవత్సరం చివర దశకు చేరుకున్న నేపథ్యంలో గ్రంథాలయాలను సందర్శించిన దాఖలాలు ఏటా కనపడుతున్నాయి. విద్యార్థులకు వేసవి విడిదిగా గ్రంథాలయాలు విశ్రాంతిని విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల ప్రాధాన్యతపై ఈ కథనం మండపేట నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 43 గ్రామాలు, రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 77 గ్రామాలున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రేడ్–1 గ్రంథాలయం–1, మున్సిపాలిటీ పర్యవేక్షణలో మరొకటి ఉన్నాయి. రాయవరం, మాచవరం, కపిలేశ్వరపురం, అంగర, వెల్ల, ద్రాక్షారామ, పామర్రు, అముజూరు, కాజులూరులలో గ్రేడ్–3 గ్రంథాలయాలున్నాయి. వల్లూరులో వీడీసీ గ్రంథాలయం, అర్తమూరు, తాపేశ్వరం తదితర గ్రామాల్లో ప్రైవేటు గ్రంథాలయాలున్నాయి.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రంథాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలకు 2021లో రూ.1.22 కోట్లతో 1,06,903 పుస్తకాలను సమకూర్చింది. వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల పేరుతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 223 గ్రంథాలయాలకు భవనాలను నిర్మించేందుకు కార్యాచరణకు పూనుకుంది. పుస్తకాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ దాదాపు చివరిదశకు చేరుకుంది. ఇప్పటికే లక్ష పుస్తకాలను కంప్యూటరైజ్డ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 102 ప్రభుత్వ గ్రంథాలయాల్లో 57 గ్రంథాలయాలకు సొంత భవనాలున్నాయి. 14 అద్దె భవనాల్లోనూ, 31 ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లో నడుస్తున్నాయి. రామచంద్రపురంలో భవనం సమకూర్చింది.

రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఇలా..

మండలం	గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో
మండపేట అర్బన్	గ్రేడ్-3 - 01
రాయవరం	గ్రేడ్-3 - 02
కపిలేశ్వరపురం	గ్రేడ్-3 - 02
రామచంద్రపురం	గ్రేడ్-1 - 01
రామచంద్రపురం రూరల్	గ్రేడ్-3 - 02
కె.గంగవరం	గ్రేడ్-3 - 02
కాజులూరు	గ్రేడ్-1 - 01
మొత్తం	గ్రేడ్-1 రెండు, గ్రేడ్-3 తొమ్మిది గ్రంథాలయాలున్నాయి

పుస్తకాలు చదివితే విజ్ఞాన సముపార్జన



విద్యార్థి దశ అనేది మొత్తం జీవితానికి పునాది. ఆ దశలో ప్రతి క్షణం సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులు గుర్తించాలి. ప్రణాళికాబద్ధంగా అవసరమైన పుస్తకాలను చదువుకోవడం మేలు. అందుకు గ్రంథాలయాన్ని సందర్శించాన్ని అలవాటు చేసుకోవాలి.

– బి.రాజుగోపాల్, పోటీ పరీక్షల విద్యార్థి, పడమర ఖండ్రిక

నేడు నిడసనమెట్ట, వల్లూరులలో పర్యటన

కపిలేశ్వరపురం: మండలంలోని నిడసనమెట్ట, వల్లూరు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటిస్తారని జెడ్పీటీసీ పుట్టపూడి, అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులుతో కలిసి ఎమ్మెల్సీ తోట ఇంటింటా ప్రచారం చేస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: స్థానిక టౌన్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ టౌన్–2 ఫీడర్, టౌన్ వన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయనంద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో మెయిన్ రోడ్డు, రత్నంపేట, గుబ్బల వారిపేట, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి, లలిత నగర్, కవలవారి సావరం, ముచ్చిమిల్లి, ఆర్టీఓ ఆఫీస్, మద్యకొంపలు, గవర్నమెంట్ హాస్పటల్ కాలేజ్, మోడరన్ కాలేజ్, రామకృష్ణ సెంటర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, ముచ్చిమిల్లి రోడ్డు, కమ్మవారి సావరం ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

మామిడికుదురు: రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ రెండో తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆరు మండలాల్లో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, కెరీర్ గైడెన్స్‌పై ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల వీరబ్రహ్మం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ తెలిపారు. గురువారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసిన అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు. రెండో తేదీ మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు ఈ శిక్షణ ఇస్తారని చెప్పారు. మామిడికుదురు, మలికిపురం, పి.గన్నవరం, అమలాపురం, కొత్తపేట, ఆలమూరు మండలాల్లో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆశీల వసూలుకు వేలం

అంబాజీపేట: మాచవరం పంచాయతీకి సంబంధించి రోజువారీ సంత, జంతు వధశాల, వారపు పశువులు, కూరగాయల సంతలకు గురువారం ఆశీలు వసూలు చేసుకునేందుకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు వేలం నిర్వహించారు. రోజువారి సంత రూ.3.72 లక్షలు, జంతు వధశాల రూ.35 వేలు, వారపు కూరగాయల సంత రూ.89,200, వేలంలో పాటదారులు దక్కించుకున్నారు. అయితే పశువుల సంత వేలాన్ని అధికారులు వాయిదా వేశారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ డ్రాప్స్‌ను అందజేశారు. ఎనిమియా నివారణకు ప్రతి గురువారం ఈ డ్రాప్స్ అందిస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందరికీ పంపిణీ చేయడంతో పాటు, ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జనవరి నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్ సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేశారు. పలు సూచనలు, సలహాలను అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్, ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారూ స్టార్ క్యాంపెయినరే..

- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్
- పట్టణంలోని 8వ వార్డులో ఇంటింటా ప్రచారం



పట్టణంలో 8వ వార్డులో ఇంటింటా ప్రచారంలో సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్షాన ప్రజలు ఉన్నారని, లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ స్టార్ క్యాంపెయినర్లగా ప్రచారం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో గురువారం ఇంటింటా ప్రచారాన్ని సూర్యప్రకాశ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబం పొందిన లబ్ధిని వారికి వివరించి తిరిగి ఇదే విధంగా సంక్షేమ పథకాలను అందించాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోను 50 శాతం ఎస్సీ బీసీ, మైనార్టీలకు టిక్కెట్లు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని సూర్యప్రకాశ్ అన్నారు. అయిదేళ్ల ప్రభుత్వ కాలంలో బీసీ ఎస్సీ మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వారి అభివృద్ధికి పథకాలను అమలు చేశారన్నారు. మేలు జరిగితేనే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వాని ఓటు వేయాలని చెప్పే దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేసిన ఘనత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వానిదేనని సూర్యప్రకాశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, 8 వ వార్డు కౌన్సిలర్ భావాల మంగామణి భద్రరావు, వార్డు నాయకులు చింతలపాటి సురేష్ రాజు, బొప్పే శ్రీనివాస్, చింతలపాటి నరేంద్ర రాజు, అల్లం మహేష్, సలా మల్లికార్జున, పలివెల మహాలక్ష్మి, బొప్పే గణేష్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వార్డు పెద్దలు, నాయకులు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పేకేటిపాకలలో పర్యటన



పేకేటిపాకలులో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: పేద, మధ్య తరగతి కుటుంబాల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం పేకేటిపాకలులో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. వృద్ధులు ఆప్యాయతతో పలకరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట అడుగులో అడుగు వేస్తూ ఇంటింటి పర్యటనలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. పేదలపై మానవత్వంతో కూడిన ఆలోచనతో దేశంలో మరెక్కడా లేని సంక్షేమ పథకాలను సీఎం జగన్ రూపొందించారన్నారు. కుల, మత, ప్రాంతీయ, రాజకీయ బేధాలను చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ లబ్ధిని అందించికన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ పంపన లక్ష్మి, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి చొరవ చూపుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిరిపురపు శ్రీనివాస్, పెదపాటి సత్యనారాయణమూర్తి, గారపాటి అశోక్ కుమార్, అన్నందేవుల కృష్ణారావు, ఈదర వీరాస్వామి, వరదా చక్రవర్తి, గ్రంధి శ్రీనివాస్, సూరంపూడి సత్యప్రసాద్, టేకిముడి శ్రీనివాస్, పిల్లా సూరిబాబు, ముక్కపాటి కోటేశ్వరరావు, షేక్ సుబాన్, నాగిరెడ్డి రాంబాబు, పంపన పద్మారావు, గ్రంధి సూరిపండు, బూర అమ్ములు, తోరం శ్రీనివాస్, దేవు ప్రసాద్ నాయుడు, వై గంగాధరం, వాసంశెట్టి నాగేశ్వరరావు, తణుకు అశోక్, వాసంశెట్టి శివ, కడియాల చినబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

సోమేశ్వరంలో పార్టీ కార్యాలయం ప్రారంభించిన పృథ్వీరాజ్



సోమేశ్వరం నాయకులు, కార్యకర్తలతో పృథ్వీరాజ్

రాయవరం: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని సోమేశ్వరంలో సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సమాజంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలంటే మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోట త్రిమూర్తులు, అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లను ప్రతి ఒక్కరూ బలపర్చాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ప్రతి నాయకుడికి, పార్టీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నేతలు నాగదేవర తాతాజీ, గుడాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం బాధ్యతగా గుర్తించాలి



కపిలేశ్వరపురం సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని తహసీల్దార్ రాజరాజేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో గురువారం జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలపై 'నీ ఓటు నీ బాధ్యత' పేరుతో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా శక్తి సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు వృత్తి బాధ్యతగా భావించి ఓటు హక్కు విలువను వివరించాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, వైఎస్సార్ క్రాంతి పథం, తదితర ప్రభుత్వ శాఖల అధికారులు మాట్లాడారు. అనంతరం గ్రామ వీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 'ఓటు–ప్రజాస్వామికి హక్కు', 'ఓటు–భవిష్యత్‌కు మార్గం' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచాలి



శిక్షణలో పాల్గొన్న సీహెచ్‌ఓలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రశాంతి

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ

రామచంద్రపురం రూరల్: ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచి వారి జీవన ప్రమాణాలు పెరిగేలా కృషి చేయాలని సీహెచ్‌ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లకు రామచంద్రపురం డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి సూచించారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలోని 40 మంది సీహెచ్‌ఓలకు బ్యాచ్‌ల వారీగా నూరా హెల్త్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆధ్వర్యంలో కేర్ కంపానియన్ ప్రోగ్రామ్ శిక్షణలో రెండో రోజు ఆమె పాల్గొన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓలు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను వారి వారి గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగులు, పిల్లలు, కిశోర బాలికల ఆరోగ్య నివేదికలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హైరిస్క్ కేసులను గుర్తించి వారి ఆరోగ్య మెరుగుకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆరోగ్య సమస్యలు, లక్షణాలు, నివారణా చర్యలు ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చిత్రాలతో కూడిన ఫ్లిప్ చార్ట్‌ల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కోరారు. జిల్లా ప్రోగ్రాం కన్సల్టెంట్ డాక్టర్ కార్తిక్, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్‌లు సీహెచ్‌ఓలకు శిక్షణ ఇచ్చారు.


ఆరోగ్య సమస్యలపై అవగాహన

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రిక పోసమ్మ ఆలయ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం అంగర పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి పి.రత్నకుమారి ఆదేశాలపై వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేడి వాతావరణం మరో రెండు నెలలు పాటు కొనసాగనున్న నేపథ్యంలో రోజుకు 3 నుంచి నాలుగు లీటర్ల నీటిని క్రమ పద్ధతిలో తాగాలని సూచించారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనాల తనిఖీలు

కాజులూరు: మండలంలోని పలు ప్రధాన రహదారులలో పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది వాహనాలనను తనిఖీ చేస్తున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలోని జగన్నాథగిరి, గొల్లపాలెంలలోనూ, యానం, ద్వారపూడి రహదారిలోని కోలంక, కుయ్యేరులలోనూ పలు ప్రధాన కూడళ్లలో పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది మోటారు సైకిళ్లు, కార్లు, భారీ వాహనాలను సైతం ఆపి తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం గొల్లపాలెంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్, ఎంఈఓ వై.నాగేశ్వరి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యం అనధికారికంగా మద్యం, నగదు, ఇతర సరుకుల తరలింపులను నిరోధించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకూ తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు అత్యవసర పరిస్థితులలో మాత్రమే నగదు, సరుకులతో ప్రయాణించాలని సూచించారు.

31న వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం



అల్లూరి శ్రీనివాసచౌదరి

రాయవరం: లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో ఈ నెల 31వ తేదీన జిల్లాస్థాయి వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. ఎనిమిదేళ్ల వయస్సు నుంచి 16 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ వ్యక్తిత్వ వికాస శిక్షణఇస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో ఆత్మవిశ్వాసం, సంపూర్ణ అభివృద్ధి, ఆరోగ్యం, మాస్టర్ మైండ్, ఏకాగ్రత–జ్ఞాపక శక్తి పద్ధతులు, సమయ నిర్వహణ–కమ్యూనికేషన్ నైపుణ్యాలు తదితర పలు అంశాలను చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

శిక్షణ శిబిరంలో భాగంగా విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో 'విద్యార్థి విజయానికి రాజపథం' 'మానవత సంస్కార విద్య' పుస్తకావిష్కరణ చేయనున్నట్టు ఆయన తెలిపారు. 'పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించడానికి 'మానవత సంస్కార విద్య' ఒక సమగ్ర మార్గదర్శిగా ఉపయోగపడుతుందన్నారు. అదే రోజు ఆశ్రమంలో చిన్నారులకు ప్రత్యేక వైద్య శిబిరం, అన్ని వ్యాధులకు ఉచితంగా నిపుణులతో వైద్య పరీక్షలు, ఉచిత హోమియో మందులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9966673111, 9966673283 నంబర్లు లేదా www.manavata.orf సంప్రదించాలన్నారు.


లోక రక్షకుడు..ఏసుప్రభువు





సొదాగర్ చిత్రీకరించిన కల్వరిపై ఏసుప్రభువు చిత్రం (అంతర చిత్రం) ఇండిగమిల్లి సొదాగర్

రాయవరం: త్యాగానికి ప్రతీకగా నిలిచిన గుడ్‌ఫ్రైడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకునేందుకు చర్చిలు ముస్తాబవుతున్నాయి. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని పలువురు పలు రకాలుగా ఏసుక్రీస్తును స్తుతిస్తున్నారు. రాయవరం గ్రామానికి చెందిన ఇండిగమిల్లి సొదాగర్ అనే చిత్రకారుడు కల్వగిరిపై ఏసుప్రభువు బలిదానం చేసిన ఘట్టాన్ని వాటర్ కలర్స్‌తో చిత్రీకరించి, తన భక్తిప్రపత్తులను చాటుకున్నాడు. రెండు గంటల సమయంలో ఏసు క్రీస్తు చిత్రపటాన్ని చిత్రీకరించినట్లు సొదాగర్ తెలిపాడు. అలాగే రాయవరం గ్రామానికి చెందిన పాపుల కోసమే ఏసు ప్రభుత్వ బాధలు అనుభవించినట్లు తెలిపే చిత్రాన్ని రాయవరం గ్రామానికి చెందిన ఆర్టిస్ట్ రామవరపు గోపాలకృష్ణయ్య వాటర్ కలర్స్‌తో వేసిన చిత్రమిది. సర్వలోకానికి క్షమాగుణాన్ని ప్రకటించిన ఏసునాథుడు అంటూ గోపాలకృష్ణయ్య చిత్రీకరించాడు.





పాపుల కోసమే ఏసుబాధలు అన్నట్లుగా తీర్చిదిద్దిన చిత్రం (అంతర చిత్రం) రామవరపు గోపాలకృష్ణయ్య

గంటి పీఏసీఎస్ టర్నోవర్ రూ.4.83 కోట్లు

కొత్తపేట: మండలంలోని గంటి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) బిజినెస్ టర్నోవర్ రూ.4,83,43,000తో నడుస్తోందని సంఘం పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు తెలిపారు. గురువారం సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 29 వరకూ సంఘ ఆదాయ, వ్యయాలు, ఇతర అంశాలపై సమీక్షించి ఆమోదించారు. సంఘంలో సభ్యులకు రూ.5,68,34,000 అప్పులుగా ఇచ్చినట్టు, ప్రస్తుతం రూ.4,68,314 లాభంతో నడుస్తున్నట్టు వివరించారు. 2022–23 ఆడిట్ రిపోర్టు, 2023–24 సాలుసరి నివేదిక, 2024–25 అంచనా బడ్జెట్ ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘ పర్సన్ పోలిమాటి అంజనీకుమారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.